కథ

# బుద్ధుని జ్ఞానబోధ

సోమవఝుల నాగేంద్రప్రసాద్

ఒకానొకనాడు గౌతమబుద్ధుడు తపోదీక్షలో ఉండగా, సేఠ్ చమన్‌లాల్ అనే ధనవంతుడు తన భార్యతో సహా బుద్ధుని కాళ్ళపై పడి బోరుమన్నాడు. బుద్ధుడు 'మీకొచ్చిన కష్టమేమిటని' వారిని అడుగగా 'మహానుభావా, నా పేరు శేఠ్ చమన్‌లాల్. ఈమె నా ధర్మపత్ని. ఆ భగవంతుని దయ వలన నాకు దేనికి లోటు లేదు. మూడు తరాలుకి సరిపడా ఆస్తులున్నాయి' అంటూ వినయంగా చెప్పాడు.

'మరి అన్నీ ఉండగా ఎందుకు విచారంగా ఉన్నారు?' అని బుద్ధుడు వారిని ప్రశ్నించాడు.

'స్వామీ! మీరన్నట్లు నావద్ద అన్నీ ఉన్నాయి. కానీ మనసుకి శాంతి లేదు. నాకున్నది ఒక్కగానొక్క కొడుకు. వాడు ప్రస్తుతం ఏదో తెలియని రోగంతో చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్నాడు. గొప్ప గొప్ప వైద్యులందరు ఏమీ చెయ్యలేమని ఏనాడో పెదవి విరిచేశారు. నా కొడుకుని కాపాడగలిగేది ఒక్క దైవశక్తి మాత్రమేనని తేల్చి చెప్పడంతో, మీలాంటి మహాత్ముల వద్ద అటువంటి శక్తులు ఉంటాయని విని గంపెడు ఆశతో వచ్చాను. మీరే వాడిని రక్షించి మాకు పుత్రభిక్ష పెట్టి, మా వంశాన్ని కాపాడండి' అంటూ ఆ దంపతులు బుద్ధుని ఎంతో దీనంగా వేడుకున్నారు.

బుద్ధుడు తన తపోబలంతో అంతా తెలుసుకొని, ఆ దంపతులనుద్దేశించి ఇలా అన్నాడు 'చూడండి, చావు పుట్టుకలన్నవి ఎవరి చేతుల్లోను లేవు. పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక తప్పదు. మరి మీ పిల్లవాణ్ణి బ్రతికించి ధర్మవిరుద్ధమైన కార్యాన్ని చేయమని ఎందుకు అడుగుతున్నారు? మీ మనసుని రాయి చేసుకుని, ఆ భగవంతున్ని మీకు కావాల్సిన ధైర్యాన్ని ప్రసాదించమని వేడుకోండి' అంటూ వారికి నచ్చచెప్పబోయిన బుద్ధునితో 'స్వామీ మీవంటి మహాత్ములే కాదంటే మాలాంటి వారి గతి ఏంకాను. మీరు కోరినంత ధనం ఇస్తాము. ఇంకా కావాలంటే మా సర్వస్వం మీకు ధారపోస్తాము. దయచేసి మా కుమారుణ్ణి బ్రతికించండి' అంటూ ఆ దంపతులు మరొక్కసారి వేడుకున్నారు.

'సర్వసంగ పరిత్యాగులమైన మాకు నీవిచ్చిన ధనముతో ఏమి పని' అని వారికి మరొక్కసారి సత్యబోధ చేయబోయాడు బుద్ధుడు.

'స్వామీ మీరు ఏం చెప్పినా వినేది లేదు. మీరు మాకు పుత్రభిక్ష పెట్టేంతవరకు మేం మీ పాదాలను వదలం' అంటూ ఆ దంపతులిరువురు మొండిగా అక్కడే నిలబడిపోయారు.

బుద్ధుడు వారికి జీవితసత్యాన్ని, సృష్టి రహస్యాన్ని బోధించవలసిన సమయమాసన్నమైందని తలచి వారితో 'నేను మీ బిడ్డని సృష్టికి విరుద్ధమైనా తప్పకుండా బ్రతికిస్తాను, అయితే అందుకు మీరొక పని చేయాలి' అంటూ వారివంక చూశాడు.

'చెప్పండి స్వామీ, మా వంశం కోసం మీరు ఏం చెయ్యమన్నా మేం చెయ్యడానికి సిద్ధం' అంటూ ఆ దంపతులిద్దరు ఒకేసారి అన్నారు.

'మీరు రేపు ఉదయం ఈ చుట్టుప్రక్కల గ్రామాలకి వెళ్ళి నా కోసం భిక్ష తీసుకొని రావాలి. మీరు తెచ్చిన భిక్షనే నేను స్వీకరిస్తాను. అంతవరకు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టను' అంటూ వారితో చెప్పాడు బుద్ధుడు.

'ఓస్ అంతేనా, అంటూ అక్కడనుండి బయలుదేరబోతున్న శేఠ్ దంపతులతో 'ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీకు భిక్ష వేసేవారు ఎటువంటి కష్టాలలోను, దుఃఖాలతోను ఉండకూడదు. అలా ఉన్నవారి వద్ద నుండి మీరు భిక్షని స్వీకరించకూడదు. కాబట్టి భిక్ష తీసుకొనే ముందు ఆ విషయాన్ని తెలుసుకొని మరీ భిక్షను తీసుకోండి' అని బుద్ధుడు వారికి షరతును విధించాడు.

* * *

శేఠ్ దంపతులు మర్నాడు ఉదయాన్నే బుద్ధుడు చెప్పినట్లే భిక్షని తెచ్చే నిమిత్తం ఆ చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళారు. వెళ్ళిన ప్రతిచోటా భిక్ష తీసుకొనే ముందు, భిక్ష వేసేవారిని కుశల ప్రశ్నలు అడిగి, వారికున్న కష్టాల గురించి, దుఃఖాల గురించి అడిగి తెలుసుకొనేవారు. ఇలా ఎంతమందిని అడిగినా ప్రతి ఒక్కరు తమకు ఏదో ఒక లోటు ఉన్నట్లుగానే చెప్పారు. కొంతమందికి సంతానం లేకపోతే, కొంత మందికి ఆరోగ్యం సరిగ్గా లేక తినడానికి తిండి కూడా లేని దారిద్ర్యంలో ఉన్నట్లుగా చెప్పారు. అలా ఆ దంపతులు సాయంత్రం వరకు తిరిగినా వారికి అసలు సమస్యలు గాని, కష్టాలు గాని లేనివారు దొరకకపోవడంతో, ఎవరి వద్ద నుండి భిక్షని తీసుకొనే అవకాశం కలగక భిక్ష లేకుండానే వట్టి చేతులతోనే బుద్ధుని వద్దకు తిరిగివచ్చారు.

'ఏమైంది శేఠ్. ఎన్ని గ్రామాలు తిరిగినా నీకు భిక్ష వేసేవారే దొరకలేదా?' అమాయకంగా అడిగాడు బుద్ధుడు.

'క్షమించండి స్వామీ! ఎవర్ని అడిగినా వారు ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నట్లే చెప్పారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తిరిగినా సమస్యలు గాని, కష్టాలు గాని, దుఃఖం గాని లేనివాళ్ళు ఎవరూ కనిపించ లేదు' అంటూ సిగ్గుగా చెప్పారా దంపతులు.

చూశావా శేఠ్, 'ఈ లోకంలో ప్రతి ఒక్కరు ఏదో ఒక సమస్యతోను, దుఃఖంతోను జీవిస్తున్నారు. సుఖ దుఃఖాలకు ఎవరూ అతీతులు కారు. కాబట్టి నామాట విని, నీ పుత్రుని మీద వ్యామోహం తగ్గించుకో. నీకింకా బోల్డంత వయసుంది. ముందు ముందు నీకు పిల్లలు పుట్టవచ్చు. అందుచేత అర్థాయుష్కుడైన కొడుకు గురించి చింతించకుండా, మమకారం అనే మాయలోనుండి బయటపడు. అప్పుడు నీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అలాగే నీకున్న అపారమైన సంపదలోనుండి కొంత ధనాన్ని పేదసాదల సహాయం కోసం, మరికొంత ధనాన్ని పుణ్యకార్యాలకు ఉపయోగించు. అలాచేస్తే నీకు అంతా మంచే జరుగుతుంది' అంటూ బుద్ధుడు అతనికి జ్ఞానోపదేశం చేశాడు.

బుద్ధుని మాటల్లోని సత్యాన్ని గ్రహించిన శేఠ్ 'స్వామీ నన్ను క్షమించండి. ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదని తెలిసి కూడా పుత్రుని మీది వాత్సల్యంతో మిమ్మల్ని సృష్టి విరుద్ధమైన కార్యం కోసం బలవంతం పెట్టాను' అంటూ అతని కాళ్ళ మీద పడిపోయాడు.